# ఘటన

అడుగడుగునా క్షుద్రశక్తులూ, పైశాచిక యాగాలూ, చేతబడులూ వున్న యీ దిక్కుమాలిన కథ చదవకుండా వున్నా బాగుండును. ఎక్కడ చూసినా దెయ్యాలూ మనుషులూ కలగాపులగంగా రాసుకు పూసుకు తిరుగుతున్నారా అనిపిస్తుంది. నాన్‌సెన్స్ దెయ్యాల్లేవు భూతాల్లేవు అనడానికి లేకుండా, చచ్చి నరకాన్నున్న సుబ్బారావు దెయ్యమై, మొన్నరాత్రి, సినీమానుంచి తిరిగొస్తున్న ఆచారిగాణ్ణి నడిరోడ్డు మీద నిలబెట్టి, నే నివ్వవల్సిన అయిదువేలూ వెంటనే వాళ్ళా విడకివ్వకపోతే నేను కట్టుకున్న యింటిని పునాదులతో సహా పెళ్ళగించి పారేస్తా నన్నాట్ట. నాకెందుకురా చెప్పడం? ఆ చెప్పేదేదో వాడికే స్వయంగా కనబడి చెప్పకూడదా అని ఆచారిగాడు పిశాచి శేషుడైన సుబ్బారావుతో అన్నాట్ట. "వాణ్ణి చూస్తే (అనగా నన్ను) నాకు ఆవేశం ఆగదు. ఆపైన పూనేశానంటే వాడు గుండాగి చస్తాడు. మరింక అప్పెవరు తీరుస్తారు? అంచేత నేనిలా ప్రతిజ్ఞచేసేనని వాణ్ణి నువ్వే హెచ్చరించు" అని ఆచారిగాడికి వాడి పైశాచిక సందేశాన్నందచేసి చూస్తుండగా గాలిలో కలిసి పోయాట్ట. బాబ్బాబు వాడి అప్పుతీర్చి నాకీ దెయ్యం పీడ వొదిలించమని ఆచారిగాడొకటే గోల. బతికున్న అప్పులాళ్ళతోబాబు చచ్చిన అప్పులాళ్ళు కూడా యిలా పీడిస్తే మనిషికి ఊపిరాడుతుందా?!

ఇలా ఆలోచించుకుంటూ గదిలో ఒక్కణ్ణీ పడుకున్నాను. నే నింటికి రావడం కాస్త ఆలస్యమైంది నాలుగిళ్ళవతల యింట్లో వున్న మహిళోద్ధరణ సంఘ అధ్యక్షురాలితో అత్యవసర కార్యక్రమం మీద రెండో ఆట సినీమాకెడు తున్నట్టు మా ఆవిడ చీటీ రాసింది. ఆ చీటీ, తాళం చెవీ నా మొహాన్న పడేసి పనిమనిషి ఉడాయించింది. నీరసంగా మంచంమీద నడుంవాల్చి పక్కనేవున్న వారపత్రిక అందుకుని ఈ కథ చదివేను. అసలే సాయంత్రం ఆచారిగాడు చెప్పిన సంఘటన విన్నప్పట్నుంచీ కనబడ్డ ప్రతీ వ్యక్తీ మనిషో దెయ్యమో ఆనవాలు పట్టలేక గుండెలు పీచుపీచుమంటూ వున్నాయి. దానికి సాయం ఈ కథాచిత్రవధ వొకటి!

సిటీకి దూరంగా వున్న కోలనీ. చుట్టు పక్కల యిళ్ళల్లో యింకా మనుషులు దిగలేదు. నరసంచారం తక్కువ. ఎదురుగా పెద్ద బంగన బయలు. తర్వాత తెల్సింది, వెనక అదంతా శ్మశానంట. దానా దీనా రాత్రి కిటికీలోంచి బయటకి చూడాలంటే గుండెలు టిప్పూ టిప్పూమంటాయి. కిటికీ తలుపులు వేసేద్దామా అనుకున్నాను. తీరా కిటికీవరకూ వెడితే బయటనుంచి సుబ్బారావు గాడు హహ్హ హ్హ హ్హ అంటూ ప్రత్యక్షమైతే? కిటికీలోంచి చెట్టుకొమ్మల నీడ గోడ మీదపడి, బయట గాలి మూలంగా, వింత వింత ఆకారాల్ని స్ఫురింపజేస్తూ రా రా అంటూ పిలుస్తున్నట్టు కనబడింది. మధ్య మధ్య కుయ్యోమంటూ యీదర గాలి రోదన. పక్కనున్న టేబుల్ లాంప్ ఆర్పేద్దామని వొంగుతుంటే ఫెడీల్ మని లైట్లు ఆరిపోయేయి. బయట వెన్నెల మూలంగా గోడమీద నీడలు ఆ చీకట్లో మరింత ప్రస్ఫుటంగా పైశాచిక నృత్యం ప్రారంభించేయి. బయట తలుపు గడియ పెట్టేనో లేదో అన్న అనుమానం పెనుభూతంలా అవహించింది. ఛీ! ఏమిటీ పిరికితనం? అనుకుంటూ 'శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం, ప్రభాదివ్యకాయం' అని హృదయాంతరాళాలు ప్రతిధ్వనిస్తుండగా, ధైర్యం కూడ గట్టుకుని మంచం దిగి తడుముకుంటూ వెళ్ళి హాల్లో తలుపు గడియ తడిమి చూశాను. వేసేవుంది. వెధవ అనుమానం! వెధవ భయం! సినీమా అవ్వాలి, ఆ జనం తోపుడులోంచి బయటపడాలి, ఆటో దొరకాలి, బేరం కుదరాలి, యింటికి రావాలి. దీని సినీమా పిచ్చి మండిపోనూ! నాకు మా ఆవిడ సాయమని కాదు, ఇంట్లో వుంటే ఒకళ్ళ కొకిళ్ళ సాయం కదా! ఇంకా రెండు గంటలు గడవాలి.

ఇంతలో గుండె ఝల్లుమనేలాగ టెలిఫోన్ మోగింది. తడుముకుంటూ తటపటాయిస్తూనే రిసీవరెత్తి, హలో అన్నాను. "నేనూ సుబ్బారావుని. యింటి అప్పు విషయంలో..." సందేహం లేదు వాడి గొంతుకే. ధన్‌మని రిసీవర్ పెట్టేసి ఒక్క ఉదుటన గంతేసి మంచం మీద మెత్తగా తగలడం, మ్యావ్‌మనడం, పిల్లి కిటికీలోంచి బయటకి గెంతడం ఒక్క క్షణంలో జరగడంతో వొళ్ళంతా చెమటలు పట్టేస్తున్నాయి.... హార్టెటాకయి వుంటుంది.

రోజులెలా మారిపోయేయి? నేను రాధని పెళ్ళాడ్డానికి ముందు శాంతని ప్రేమించేను. శాంతకూడా నన్ను ప్రేమించింది. మే మిద్దరం పెళ్ళిచేసుకుందా మనుకున్నాం. నే నెంత మొత్తుకున్నా వినకుండా 'వుద్యోగం చేసుకునే

అమ్మాయితో పెళ్ళేమిటి! పైగా, ఆ అమ్మాయి యమ్మెస్సీ ఫస్ట్‌క్లాసూ, నువ్వు సెకండ్‌క్లాసూ. రేపొద్దున్న నిన్ను తోసి రాజంటుంది' అంటూ మా అమ్మా నాన్నా నన్ను బెదిరించి చివరికి రాధనిచ్చి నాకు పెళ్ళి చేశారు. శాంత నిలువెల్లా శాంతమే నా పెళ్ళికొచ్చి "పోనీలే, నువ్వు బాధపడకు. అంతా ఘటన! ఎలా రాసుందో అలాగే జరిగింది. రాధని జాగర్తగా చూసుకుంటూ నన్ను మర్చిపో" అని బోధించింది.

రాధతో పెళ్ళయ్యి మూడేళ్ళయింది. రాధకీ శాంతకీ పోలికే లేదు శాంత నన్నర్థం చేసుకున్నట్లు రాధర్థం చేసుకోలేదు. పైగా, నన్ను పిరికివాణ్ణనీ, స్వార్థపరుణ్ణనీ, సరదాల్లేని మనిషిననీ దెప్పుతూ వుంటుంది. ఎన్నోసార్లు శాంతని పెళ్ళాడితే ఎంత బాగుండేదో అనుకునేవాణ్ణి. ఏం లాభం? అంతా ఘటన!

విధి బలీయం. కారేక్సిడెంట్లో రాధ పోయింది! ఆ రోజున నన్ను ఓదార్చడానికి శాంతొచ్చింది. అప్పటికింకా శాంతకి పెళ్ళికాకపోవడం నా అదృష్టం. రెండు నెలల తర్వాత ధైర్యంగా శాంతని పెళ్లాడేక తెలిసింది. ఇద్దరం సరదాగా ఉద్యోగాలు చేసుకుంటూ హాయిగా వుంటున్నాం అప్పు తీర్చేద్దాం, మరేం పర్వాలేదు, ఇల్లు కట్టుకుందాం అంది. కట్టుకున్నాం. మా యిద్దరిదీ ఒకే మాట, ఒకే బాట, ఒకే ఆట. రాధ జ్ఞాపకమొచ్చినప్పుడల్లా జాలేస్తుంది మంచిపిల్లే కాని అహంకారం ఎక్కువ. అందుకే కారేక్సిడెంట్లో పోయింది. ఆమెలో శాంతం వుంటే శాంతని మరిపించేటంత మంచిది. పాపం, పోయింది. అంతా దైవ ఘటన! ఇక నాకు జీవితంలో ఏ కోరికా లేదు. ఏ సమస్యా లేదు. మా జీవితం ఒక పూల....

కాలింగ్‌బెల్ లాగుంది. నిర్విరామంగా సైరన్‌లాగ మోగుతుంటే 'శాంతా!' అంటూ ఒక్క గంతులో వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా రాధ! కెవ్వుమన్నట్టు "నువ్వా?!" అన్నాను.

"నేను కాకపోతే ఎవరొస్తారనుకున్నారు?!" అంది నాకేసి ఎగాదిగా చూస్తూ.

"అబ్బే! శాంత...."

"శాంతెవరు? శాంతా శాంతా అంటూ కలువరిస్తున్నారేమిటి? నేను సినిమా కెళ్ళిందాకా వుండి, ఏ శాంతకైనా ఫోన్ చేశారా? అయినా, మీరు ఫోన్ చేస్తే రెక్కలు కట్టుకునివాలే దెవర్తుంటుంది?!" అంది నాకేసి పరీక్షగా చూస్తూ.

"అబ్బే, ఏదో కలొచ్చినట్టుంది...."

"మీ వాలకం చూస్తేనే తెలుస్తుంది, ఏదో పీడ కలొచ్చుంటుందని. ఒళ్ళంతా ఆ చెమటలేమిటి?! రామ రామ, కొత్త దుప్పటి వేసి వెళ్ళేను. ఫేన్ వేసుకోకుండా పడుకోడమేమిటండీ?! దిక్కుమాలిన పొదుపూ మీరూను!"

"వేసుకుందామనుకుంటుంటే కరెంట్ పోయింది. ఈలోగా నిద్దరట్టేసింది."

"అఘోరించినట్టే వుంది. వెళ్ళి వొళ్ళు కడుక్కుని బట్టలు మార్చుకోండి." అంది లోపలి కొచ్చి మంచం మీద దుప్పటి లాగిపారేస్తూ.

మర్నాడుదయం టెలిఫోన్ మోగితే రాధే అందుకుంది రిసీవర్. "హలో? ఏం చిన్నాన్నా!.... అహఁ!.... నువ్వు తల్చుకుంటే చెయ్యలేందేముంటుంది! థేంక్స్.... ఆయనతో చెప్తాను. ఇంకా లేవలేదు.... అలాగా? ఏం మనిషో! ఏం లోకమో! నోట్లో నాలిక లేకపోగా.... అయితే, ఒహటిలే నేను రాత్రి యింటికి రావడం ఆలస్యమైంది. పైగా, పెళ్ళుమంటూ జ్వరం. రాత్రి తెల్లవార్లూ 'శాంతా! శాంతా!' అంటూ ఏమిటేమిటో కలవరింతలు! నాకు తెలుసున్నంతలో వాళ్ళ బంధువుల్లో శాంత.... అహఁ! అదా సంగతి.... అంత గ్రంథంవుందన్నమాట. .. పోనీలే అదృష్టవంతురాలు.... అలాగే చెప్తాను.... మెనీ థేంక్స్ చిన్నాన్నా!" అంటూ రిసీవర్ దింపేసి పెను తుఫానులాగ నా గదిలో జొరబడి ''రాత్రి టెలిఫోన్‌లో నేను సుబ్బారావుని ఇంటి అప్పు విషయంలో మాట్లాడాలి అంటుంటే రిసీవర్ పెట్టేశారుట, ఎంత అప్రతిష్ట?'' అంటూ సుప్రభాతం ప్రారంభించింది.

''ఏ సుబ్బారావు?'' అన్నాను బద్ధకంగా.

''మా వేలువిడిచిన పినతండ్రి సుబ్బారావండీ! యల్ఐసీలో డివిజనల్ మేనేజర్'' అంది.

వేలు విడిచిన సుబ్బారావో, ప్రాణం విడిచిన సుబ్బారావో నాకేం తెలుసు? ఇంత దెయ్యాలు రద్దీ వున్న యీ రోజుల్లో స్వరాన్ని బట్టి ఆనవాలు పట్టగలమా? ''ఆయననుకోలేదు'' అన్నాను ముక్తసరిగా.

''ప్రొఫెసర్ సుబ్బారావనుకున్నారా?''

''ఆయనెవరు?''

'మీరు ప్రేమించిన శాంత మొగుడు రెణ్ణెల్ల క్రితం పెళ్ళి చేసుకుని స్టేట్స్‌కి తీసుకెళ్ళిపోయాట్ట. మా చిన్నాన్న చెప్పేడు'' అంది కళ్లెగరేస్తూ. నేను ఉలిక్కిపడి లేచేను.

''ఏమిటలా కళ్ళు తేలేస్తారూ? మీరు ప్రేమించిన వేళావిశేషం! ఆ అమ్మాయికో మంచి మొగుడు దొరికేడు. సరే కాని, యివ్వాళ వాళ్ళాఫీసు కెళ్ళి మా చిన్నాన్నని కలుసుకుని అప్లికేషన్ పెట్టండి. పాతిక వేలు లోన్ యిప్పిస్తానన్నాడు. పోయిన మీ కొలీగ్ సుబ్బారావుగారి కివ్వవల్సిన అయిదువేలూ వడ్డీతో సహా బాకీ తీర్చెయ్యాలి. పాపం! ఆవిడా, పిల్లలూ ఏమిబ్బందులు పడుతున్నారో?'' అంటుంటే మళ్ళీ నాకు మగత నిద్రలాంటిది కమ్ముకొచ్చింది. *

(యువ దీపావళి ప్రత్యేక సంచిక)